సాక్షి జగిత్యాల

శనివారం, 25, మార్చి, 2023



పోషక విలువపై అవగాహన

పెగడపల్లి : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.



నృసింహుని సన్నిధిలో హరీశ్

ధర్మపురి: సినీ దర్శకుడు సంగనభట్ల హరీశ్ శంకర్ దంపతులు శుక్రవారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
34.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

ఉపవాసంతో మనిషిని బాధించడం ఇస్లాం ఉద్దేశం కాదు. పేదవాడి ఆకలి బాధలు తెలుసుకోవడమే ఇస్లాం ఉద్దేశం. – మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శని 6:32	ఆది 4:51

రంజాన్ వేళలు

‘ఫ్రూట్ హబ్’గా జగిత్యాల

- మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాలఅగ్రికల్చర్: రకరకాల పండ్లతోటలతో జగిత్యాల జిల్లా ఫ్రూట్ హబ్‌గా మారిందని రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక చల్‌గల్ మార్కెట్ యార్డులో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన షెడ్లను మంత్రి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. అరటి, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, అల్లనేరేడు, మస్క్‌మిలన్, కర్బూజ, జామ వంటి పండ్లతోటలను సాగు చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో నాగ్‌పూర్ మార్కెట్ కంటే కూడా జగిత్యాల ఫ్రూట్ మార్కెట్ ముందంజలో ఉంటుందన్నారు. అడిషనల్ కలెక్టర్ లత, ఆర్డీవో మాధురి, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి ప్రకాశ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ నక్కల రాధ, వైస్ చైర్మన్ హసీఫ్ పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డులో మంత్రి కొప్పుల ఈశ్వర్

కుల సంఘాలకు నిధులు

వెల్గటూర్(ధర్మపురి): స్తంభంపల్లిలో మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి రూ.5లక్షలు, నిర్మాణంలోఉన్న మాలసంఘ భవనం పనులు పూర్తిచేయడానికి రూ.5లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఎంపీటీసీ పాడేటి సతీశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ పాడేటి రవి పాల్గొన్నారు.

మతాన్ని అడ్డంపెట్టుకుని రాజకీయం..

రాయికల్(జగిత్యాల): బీజేపీ ప్రభుత్వం మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. రాయికల్ – మైతాపూర్ మధ్య హైలెవల్ వంతెన, రాయికల్ – రామాజీపేట మధ్య కల్వర్టు, రాయికల్‌లోని నాగారపు ఆంజనేయస్వామి ఆలయంలో ధ్యాన మందిరం నిర్మాణానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిసి మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం పట్టణంలో ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎంపీగా గెలిచిన తర్వాత ధర్మపురి అర్వింద్ జగిత్యాల నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కొట్టుకుంటే జగిత్యాలలో ఈ రెండు పార్టీలు కలిసి ఉంటాయన్నారు. పసుపు రైతులకు అర్వింద్ ఏంచేశారని ప్రశ్నించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ గంద్ర రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ సంబరం

సాక్షి దినపత్రిక 15వ వార్షికోత్సవ సంబరాలు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని యూనిట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్, బ్యూరో ఇన్‌చార్జి అనిల్, కరీంనగర్, ఆదిలాబాద్ ఎడిషన్ ఇన్‌చార్జీలు బి.శ్రీనివాస్, జి.మహేశ్, పెద్దపల్లి స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లాలోని ఆర్సీ ఇన్‌చార్జీలు, ఏడీవీటీ మేనేజర్ లక్ష్మినారాయణ, ఐటీ మేనేజర్ వేణు, ఏసీఎం మధుకర్, ప్రొడక్షన్ ఇన్‌చార్జి ప్రకాశ్, స్టోర్ ఇన్‌చార్జి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

టీబీ రహిత జిల్లాగా మార్చాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

జగిత్యాల: టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ కోరారు. శుక్రవారం స్థానిక వైద్య కళాశాలలో క్షయ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, టీబీ పీడితులకు ప్రభుత్వం ప్రతినెలా రూ.500 సాయం చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి టీబీని అంతమొందించేలా సహకరించాలని ఆయన సూచించారు. క్షయ నియంత్రణ ప్రోగ్రాం అధికారి జిల్లా అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, టీబీ నిర్మూలించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు సురేశ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రజలు సైనికుల్లా పోరాడితేనే టీబీని అంతమొందించవచ్చన్నారు. అనంతరం విశేష సేవలు అందించిన వైద్యాధికారులు, ఆరోగ్యమిత్రలకు ప్రశంసపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో అసంక్రమిత నియంత్రణాధికారి సమియొద్దీన్, శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయండి



వినతిప్రతం అందిస్తున్న నాయకులు

జగిత్యాల: ప్రతినెలా ఒకటో తేదీనే ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాలు విడుదల చేయాలని, ఈ కుబేర్‌లో పెండింగ్ బిల్లులు నెలాఖరులోపు చెల్లించాలని యూఎస్‌పీసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, ఈనెల 28న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు తిరుకోవెల శ్యామ్‌సుందర్, బోగ రమేశ్, ఎన్నం రాంరెడ్డి, శంకర్‌బాబు, కౌశిక్‌కుమార్, అంబటి భూమేశ్వర్, రాంచంద్రం, నరేందర్, రఘుపతి, ఆగమయ్య, వేణుగోపాల్, గోవర్ధన్, నరేశ్, ప్రసాద్, సత్యనారాయణ, మహేశ్, రాజయ్య పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు సాధించాలి

జగిత్యాల: విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు సాధించేలా చూడాలని తొలిమెట్టు పరిశీలన బృందం సభ్యురాలు శ్రీలత సూచించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయి పరిశీలన బృందం జిల్లాలోని పలు పాఠశాలలను శుక్రవారం పరిశీలించింది. ఆమె మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరం పూర్తయ్యేలోపు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులందరూ కనీస అభ్యాసన సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతీఉపాధ్యాయుడు పక్కా ప్రణాళికతో బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేశ్ పాల్గొన్నారు.

నృసింహుని ఆదాయం రూ.33.21లక్షలు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి హుండీని శుక్రవారం లెక్కించారు. ఈసందర్భంగా రూ.33,21,874 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాస్ తెలిపారు. గతేడాది మార్చి ఒకటో తేదీ నుంచి ఈనెల 24వ తేదీ హుండీ లెక్కించినట్లు ఆయన పేర్కొన్నారు. నగదుతోపాటు 53.600 గ్రాముల మిశ్రమ బంగారం, 8.100 కిలోల మిశ్రమ వెండి, 20 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, రేనోవేషన్ కమిటీ సభ్యులు రామన్న, గందె పద్మ, గునిశెట్టి రవీందర్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధిపాలు చేశారు..

- వ్యాపార స్థలాలు ఖాళీ చేయించారు
- షెడ్లు నిర్మించి ఇస్తామని అభయం ఇచ్చారు
- ఏడాది గడిచినా మాట నిలబెట్టుకోలేదు
- బల్దియాల్లో వీధివ్యాపారుల తిప్పలు



జగిత్యాల ఓల్డ్ హైస్కూల్ ఎదుట చిరువ్యాపారుల కోసం నిర్మించిన షెడ్లు

జగిత్యాల: ‘రోడ్ల వెంట వ్యాపారాలు వద్దు.. మీకోసం అందమైన, ఆకర్షణీయమైన, సౌకర్యవంతమైన షెడ్లు నిర్మిస్తాం.. మీరు స్థలాలు ఖాళీ చేస్తే వెంటనే పనులు ప్రారంభిస్తాం’ అని కొండంత ధైర్యం చెప్పిన మున్సిపల్ అధికారులు.. వీధివ్యాపారులను ఖాళీ చేయించారు. ఖాళీ స్థలాలు స్వాధీనం చేసుకున్నారు.. అందులో షెడ్లు నిర్మించారు.. కొన్నిచోట్ల పనులు ప్రారంభించారు. కానీ, ఏళ్లు గడిచినా స్ట్రీట్ వెండర్స్‌కు నిర్మించిన షెడ్లు కేటాయించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

జగిత్యాలలో 27 షెడ్లు పూర్తి..

- జగిత్యాల మున్సిపాలిటీలో వీధివ్యాపారాల కోసం మూడు ప్రాంతాల్లో అనువైన స్థలాలు గుర్తించారు.
- జగిత్యాలలో ఓల్డ్ హైస్కూల్ ఎదుట 27 షెడ్లు నిర్మించారు. మరో 10 షెడ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి.
- కోరుట్ల మున్సిపాలిటీలోని వీధివ్యాపారుల కోసం 12 షెడ్లు నిర్మించారు.
- మెట్‌పల్లి పురపాలిక సంఘం పరిధిలో 25 షెడ్లు నిర్మించారు.
- జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి బల్దియాల్లో నిర్మించిన షెడ్లను నేటికీ వీధివ్యాపారులకు కేటాయించడంలేదు.
- ధర్మపురి, రాయికల్ కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలు కావడంతో అక్కడ ఇంకా షెడ్ల నిర్మాణం చేపట్టలేదు. ఈక్రమంలోనే మున్సిపాలిటీల్లో జోన్ల అంశం తెరపైకి వచ్చింది.

ఆందోళనలో చిరువ్యాపారులు..

- స్థిర ప్రాంతాల్లో చిరువ్యాపారాలు చేసుకునే వారిని ఆ ప్రాంతాల్లోంచి తరలించి ఏడాది కావస్తున్నా ఇచ్చిన మాట ప్రకారం స్ట్రీట్‌వెండర్స్‌కు షెడ్లు కేటాయించడంలేదు. దీంతో తాము వ్యాపారం ఎక్కడ చేసుకోలో తెలియక వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. స్ట్రీట్‌వెండర్స్‌కు గతంలో వ్యాపారాలు చేసుకున్న ప్రాంతాల్లోనే షెడ్లు కేటాయిస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. మరోవైపు.. కొందరు ప్రజాప్రతినిధులు పైరవీలతో ఖాళీ స్థలాలు కాజేస్తున్నట్లు తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి.

జోన్లుగా గుర్తింపు..

- జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో రెడ్, గ్రీన్, ఎల్లో జోన్లు గుర్తించారు.
- రెడ్ జోన్‌లో ఎలాంటి వ్యాపారాలు నిర్వహించరాదని, గ్రీన్ జోన్‌లో ఏ వ్యాపారమైనా నిర్వహించేవీలుందని, ఎల్లో జోన్‌లో అనుమతించిడన వ్యాపారాలే నిర్వహించాలని అధికారులు సూచిస్తున్నారు.
- అయితే, జోన్లను గుర్తించిన అధికారులు.. చిరువ్యాపారులకు ఇప్పటివరకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించడం లేదు.
- కనీసం నిర్మించిన షెడ్లను కూడా వీరికి కేటాయించడంలేదు.
- తాత్కాలికంగా వ్యాపారం చేసుకునే ప్రాంతాల్లోంచి తొలగించడంతో వీధివ్యాపారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు.

తరచూ ట్రాఫిక్ సమస్యలు..

- వీధివ్యాపారులకు స్థిరమైన స్థలాలు లేవు. దీంతోవారు ఎక్కడపడితే అక్కడ వ్యాపారం చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల రోడ్లవెంట ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. జగిత్యాలలోని ఇరుకైన రోడ్లు ఉన్న ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. తహసీల్ చౌరస్తా, పాతబస్టాండ్, టవర్‌సర్కిల్, కొత్తబస్టాండ్‌లలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది.

త్వరలోనే కేటాయిస్తాం

స్ట్రీట్‌వెండర్ల కోసం షెడ్లు నిర్మించేందుకు టెండర్లు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల నిర్మించాం. వాటిని త్వరలోనే అర్హులకు అందిస్తాం. ఇందుకోసం సర్వే చేస్తున్నాం. గతంలో వ్యాపారాలు ఎక్కడ చేశారో.. అక్కడే వ్యాపారులకు షెడ్లు కేటాయిస్తాం.

– రాజేశం, డీఈ, జగిత్యాల మున్సిపల్

రహదారులే దిక్కు..

- జగిత్యాల అతిపెద్ద మున్సిపాలిటీ. కోరుట్ల, మెట్‌పల్లిలోనూ వీధివ్యాపారులను మెప్మా అధికారులు గుర్తించారు. జగిత్యాలలో 6,005 మంది, కోరుట్లలో 4,081 మంది, మెట్‌పల్లిలో 3,548 మంది స్ట్రీట్ వెండర్స్ ఉన్నట్లు గుర్తించారు. వీరు ఏదోఒకచోట స్థిరంగా వ్యాపారం చేసుకునేవారు. ముఖ్యంగా జగిత్యాలలోని ఏరియా ఆస్పత్రి, పాతబస్టాండ్, తహసీల్ చౌరస్తా, కొత్తబస్టాండ్ తదితర ప్రాంతాల్లో స్థిరవ్యాపారం చేసుకునే వారిని అధికారులు అక్కడినుంచి తరలించారు. అంతేకాదు.. ఓల్డ్ హైస్కూల్ ప్రాంతంలో నిర్మించిన 27 షెడ్లు నిరుపయోగంగా ఉన్నా.. వాటిని కేటాయించడంలేదు. ఇందుకు రాజకీయ కారణాలు అడ్డంకిగా మారాయనే విమర్శలు ఉన్నాయి.

జిల్లా సమాచారం

మున్సిపాలిటీ	నిర్మించిన షెడ్లు
జగిత్యాల	37
కోరుట్ల	12
మెట్‌పల్లి	25

మొక్కలను సంరక్షించాలి

మెట్‌పల్లి(కోరుట్ల): హరితహారం ద్వారా నాటిన మొక్కల సంరక్షణకు వేసవిలో తగిన చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ మకరంద్ సూచించారు. పట్టణంలోని జాతీయ రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలతో పాటు శివారులోని నర్సరీని ఆయన శుక్రవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. నర్సరీలో వచ్చే హరితహారం కార్యక్రమానికి అవసరమైన సంఖ్యలో మొక్కలను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం 19వార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలు పరీక్షలు చేయించుకునేలా చొరవ తీసుకోవాలని ఆయన అన్నారు.

మేడిపెల్లిలో ఆకస్మిక తనిఖీలు

మేడిపెల్లి(వేములవాడ): అడిషనల్ కలెక్టర్ మకరంద్ మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ప్లాంటేషన్‌పై ఆరా తీశారు. అధికారులకు పలు సూచలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్, కార్యదర్శి శ్రీనివాస్, కారోబార్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిల్వకోడూరు పంచాయతీకి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సర్పంచ్ పద్మావతి

గొల్లపల్లి(ధర్మపురి): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ – 2023 అవార్డును చిల్వకోడూరు గ్రామ సర్పంచ్ కందుకూరి పద్మావతి అధికారుల నుంచి శుక్రవారం అందుకున్నారు. వైకుంఠధామం, కంపోస్ట్‌షెడ్లు, పల్లెప్రకృతి వనాలు, ట్రాక్టర్, మంచినీటి ట్యాంకుల నిర్వహణ, పారిశుద్ధ్యం మెరుగుపర్చడం లాంటి అంశాల్లో ప్రతిభ చూపినందుకు చిల్వకోడూరు గ్రామపంచాయతీకి ఈ పురస్కారం లభించింది. ఆమెను పలువురు అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జలేందర్, ఎంపీపీ శంకర్ పాల్గొన్నారు.

కేసీఆర్ ఇంటిసంస్థగా సిట్

- మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి



మాట్లాడుతున్న భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కొలువులు కలగా మారాయని, పేపర్ లీకులతో నిరుద్యోగుల ఆశలపై బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు చల్లింగదని బీజేపీ నాయకురాలు, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీపై సీఎం కేసీఆర్ ఇప్పటికీ స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఐటీ మంత్రి కేటీఆర్ కేవలం ఇద్దరు ఉద్యోగులను బాధ్యులను చేసి చేతులు దులుపుకోవడం విచారకరమన్నారు. తప్పుచేస్తే తన పిల్లలను సైతం ఉపేక్షించనన్న సీఎం కేసీఆర్.. పేపర్ లీకేజీ ఆరోపణలపై మంత్రి కేటీఆర్‌ను ఎందుకు బర్తరఫ్ చేయడం లేదని ప్రశ్నించారు. ఇదేమిటని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీలపై తనజేబు సంస్థ సిట్ ద్వారా నోటీసులు జారీచేయడం దురదృష్టకరమన్నారు. టీఎస్ పీఎస్సీ ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. టీఎస్‌పీఎస్సీని రద్దు చేయడంతోపాటు, అభ్యర్థులకు రూ.లక్ష పరిహారం చెల్లించాలన్నారు. ఈనెల 25న నిరుద్యోగులకు అండగా బీజేపీ చేపట్టిన నిరుద్యోగ గోస.. బీజేపీ భరోసా కార్యక్రమానికి నిరుద్యోగులు తరలిరావాలని కోరారు. నాయకులు మదన్మోహన్, మర్రిపెల్లి సత్యం, ఆముద రాజు, గోపాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఇది చీకటిరోజు

- ప్రశ్నించే గొంతులను అణిచి వేసే కుట్రలో భాగమే
- రాహుల్ గాంధీపై అనర్హత వేటు సిగ్గుచేటు
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


జగిత్యాలటౌన్: ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే వారిపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని, ప్రశ్నించే గొంతుకల నోరు మూయించే కుట్రలో భాగంగానే రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వ రద్దు అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అధికారం కోసం కులాలు. మతాల పేరిట ప్రజలను వేరుచేసి పబ్బం గడుపుకుంటున్న బీజేపీ ప్రభుత్వానికి భారత్ జోడో యాత్రతో రాహుల్‌గాంధీ అన్నివర్గాల ప్రజలను ఏకం చేయడం నచ్చకనే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసిందని ఆరోపించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను కొల్లగొట్టిన నీరవ్‌మోదీ, లలిత్‌మోదీని విదేశాల నుంచి వెనక్కి రప్పించడంలో వైఫల్యం చెందిన బీజేపీ.. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. రాహుల్ గాంధీ సభ్యత్వ రద్దును భారతదేశంలో ప్రతీపౌరుడు తీవ్రంగా ఖండిస్తున్నారని అన్నారు. దేశం యావత్తూ ఆయనకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆర్థిక నేరస్తులకు మోదీ ప్రభుత్వం అండగా నిలుస్తోందనే భావన వచ్చేలా రాహుల్ చేసిన వ్యాఖ్యలకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడం ప్రజాస్వామ్యంలో చీకటి రోజని పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను రద్దు చేయడమేనన్నారు. దేశంలోని రోడ్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, బొగ్గు గనులు ఒకే వ్యక్తికి కట్టబెడుతూ దేశ సంపద కొల్లగొడుతుండటాన్ని ప్రశ్నించడం నేరమెలా అవుతుందని నిలదీశారు. అదానీ వ్యవహారంపై వాస్తవాలు వెలుగులోకి తెచ్చేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) వేయాలన్న ప్రతిపక్షాల ఒత్తిడికి స్పందన కరువైందని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కల్లెపెల్లి దుర్గయ్య, బండ శంకర్, గాజుల రాజేందర్, గాజంగి నందయ్య, పుప్పాల అశోక్, చందా రాధాకిషన్, లైశెట్టి విజయ్, మున్నా, చాంద్‌పాషా, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సంతకానికి రూ.పదివేలు

- రేచపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి డిమాండ్
- అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేసిన బాధిత కాంట్రాక్టర్
- వలపన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు
- జిల్లాలో కలకలం రేపిన ఘటన




గ్రామపంచాయతీ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు



డీఎస్పీ భద్రయ్య

సారంగాపూర్(జగిత్యాల): చెక్కుపై సంతకం చేసేందుకు రూ.10వేలు లంచం అడిగిన రేచపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి శుక్రవారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కడం జిల్లాలో కలకలం రేపింది. ఏసీబీ డీఎస్పీ భద్రయ్య కథనం ప్రకారం.. రేచపల్లి తురకకాశి కాలనీలో ఈజీఎస్ ద్వారా రూ.5 లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు పనులు చేపట్టారు. సర్పంచ్ ఎడమల జయ భర్త ఎడమల లక్ష్మారెడ్డి ఈ పనులు దక్కించుకుని నిర్మాణం పూర్తిచేశారు. ఈమేరకు గ్రామపంచాయతీ ఖాతాలో బిల్లు తాలూకు డబ్బు జమైంది. ఇంజినీరింగ్ అధికారులు కూడా బిల్లు రికార్డు చేసి గ్రామపంచాయతీకి అందజేశారు. అయితే, చెక్కుపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సంతకం చేయాల్సి ఉంది. సర్పంచ్ సంతకం పూర్తయింది. తాను సంతకం చేసేందుకు రూ.10వేలు కావాలని పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. తాను ఇవ్వలేనని చెప్పిన లక్ష్మారెడ్డి.. ఈనెల 17న ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారిసూచన మేరకు రూ.500 కరెన్సీ నోట్ల(రూ.10వేలు)ను లక్ష్మారెడ్డి పట్టుకుని శుక్రవారం ఉదయం పంచాయతీ కార్యాలయంలోకి వెళ్లారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శికి రూ.10వేలు అందించారు. అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు, సిబ్బంది.. వెంటనే కార్యాలయంలోకి చేరుకున్నారు. కార్యదర్శి వద్ద ఉన్న రూ.10వేలు స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకున్నారు. శనివారం కరీంనగర్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తారు. ఇన్‌స్పెక్టర్లు తిరుపతి, రవీందర్, జాన్‌రెడ్డి పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శిని అదుపులోకి తీసుకున్నాక దాదాపు 6 గంటల పాటు గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు తనిఖీచేశారు.



లక్ష్మారెడ్డి, కాంట్రాక్టర్

ఏడాది క్రితం పనులు పూర్తి..

తురకకాశికాలనీ 12వ వార్డులో 100 మీటర్ల పొడవుతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం ఏడాది క్రితమే పూర్తయ్యింది. గత ఫిబ్రవరిలో పంచాయతీ ఖాతాలో డబ్బులు జమయ్యాయి. ఇంజినీరింగ్ అధికారులు రూ.4,24,412 బిల్లు రికార్డు చేశారు. దీనికి సంబంధించిన ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీవో)ను గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. బిల్లు చెల్లింపుల కోసం ఫిబ్రవరిలోనే ఉపాధిహామీ శాఖ.. గ్రామపంచాయతీ ఖాతా డబ్బు జమ చేసింది. కాంట్రాక్టర్ లక్ష్మారెడ్డికి సీసీ రోడ్డు బిల్లు చెల్లించాలని మార్చి 6న సర్పంచ్ చెక్కు జారీచేశారు. దానిపై సంతకం కూడా చేశారు. ఆ చెక్కుపై సంతకం చేయాలని కార్యదర్శికి సూచించారు. సర్పంచ్ సూచనలు ఏమాత్రం పట్టించుకోకుండా లక్ష్మారెడ్డిని రోజూ పంచాయతీ కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు పంచాయతీ కార్యదర్శి. చివరకు సంతకం కోసం ఎంత కావాలని లక్ష్మారెడ్డి.. పంచాయతీ కార్యదర్శిని అడిగారు. దీంతో తనకు రూ.10 వేలు కావాలని డిమాండ్ చేశారు. దీంతో లక్ష్మారెడ్డి ఏసీబీ అధికారులకు కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు.

పథకం ప్రకారం ఇరికించారు

లక్ష్మారెడ్డి పథకం ప్రకారం నా బ్యాగ్‌లో రూ.10వేలు పెట్టారు. నాపై కుట్రతోనే ఏసీబీ అధికారులకు పట్టించారు. చెక్కుపై సంతకం చేసేందుకు నేను ఏనాడూ డబ్బులు అడగలేదు. నన్ను బదిలీ చేయించేందుకే డ్రామా ఆడుతున్నారు.

– విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన రిటైర్డ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి

జగిత్యాలటౌన్: ధర్మపురి శాసనసభకు 2018లో జరిగిన ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన భిక్షపతి శుక్రవారం కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాను కలిశారు. రీకౌంటింగ్ విషయంలో తనకు అన్యాయం జరిగిందని, కొప్పుల ఈశ్వర్‌కు అనుకూలంగా ఎన్నికల అధికారి వ్యవహరించారని కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. ఇదేవిషయంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో అప్పటిఎన్నికల రిటర్నింగ్ అధికారి భిక్షపతి తగిన సమాచారంతో హాజరుకావాలని కోర్టు నోటీసులు జారీచేసింది. అయినా, ఆయన కోర్టుకు గైర్హాజరయ్యారు. దీంతో ఆగ్రహించిన కోర్టు.. ఆయనను అరెస్టు చేయాలంటూ ఈనెల 21న అరెస్టు వారెంట్ జారీచేసింది. అయితే, తాను ఉద్యోగ విరమణ చేశానని, ఈ కారణంగా కోర్టుకు హాజరు కాలేదని భిక్షపతి.. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రీ కౌంటింగ్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను కలెక్టర్‌కు అందజేసినట్లు భిక్షపతి విలేకరులకు వివరించారు.

అంజన్న ఆదాయం రూ.49లక్షలు



నగదు లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఏఈవో

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి హుండీలను శుక్రవారం ఆలయ ఈవో వెంకటేశ్ సమక్షంలో లెక్కించారు. 22 రోజులకు రూ.49,1,220 నగదు సమకూరిందని అధికారులు తెలిపారు. 40గ్రాముల మిశ్రమ బంగారం, 2.600 కేజీల వెండి, 44 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరాయని వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మారుతీస్వామి, ఏఈవో శ్రీనివాస్, సహాయ కార్య నిర్వహణాధికారి రవికిషన్, ఆలయ సూపరింటెండెంట్ సునీల్, శ్రీనివాసచారి, ధర్మేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 25 నుంచి ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు

కరీంనగర్ : ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు ఏప్రిల్ 25 నుంచి మే4 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ జనార్దన్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయయని తెలిపారు. సప్లిమెంటరీ అభ్యర్థులు అభ్యాసన కేంద్రాల కో ఆర్డినేటర్స్‌ను సంప్రదించి హాల్‌టికెట్లు పొంది పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ మే 12 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెరిగిన పత్తి ధర

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్‌లో పత్తి ధర స్వల్పంగా పెరిగింది. గురువారం క్వింటాల్ పత్తికి రూ.7,400 కాగా శుక్రవారం గరిష్టంగా క్వింటాల్‌కు ధర రూ.7,500 పలికింది. మార్కెట్‌కు 115 వాహనాల్లో 1922 క్వింటాల్ పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా మోడల్ ధర రూ. 7,350, కనిష్ట ధర రూ. 6,700 ఉంది.

కమ్మేస్తున్న కాలుష్యం

- పొగతో ఉక్కిరిబిక్కిరి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని వీక్లీబజార్ కాలనీవాసులను కాలుష్యం కమ్మేస్తోంది. స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. అనేకచోట్ల అపార్ట్‌మెంట్లు, నూతన ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. తొలుత ఇళ్లలో విద్యుత్ పనులు చేపడుతున్నారు. వందుకోసం గోడల్లో ప్లాస్టిక్ పైపులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత తీగలు లాగుతున్నారు. అయితే, కొందరు కాపర్‌వైరును దొంగతనం చేసి జనావాసాల్లోనే కాల్చివేస్తున్నారు. ఆ తర్వాత కాపర్ ముద్దగా మారగడంతో కిలోకు రూ.300 ధరతో మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ దందా జిల్లా కేంద్రంలో జోరుగా సాగుతోంది.

కొత్త ఇళ్లు టార్గెట్..

జిల్లా కేంద్రంలో కొత్తగా కడుతున్న ఇళ్లను కొందరు టార్గెట్‌గా చేసుకుంటున్నారు. పైపుల్లోంచి బయటకు తీసిన కరెంట్ వైర్లను ఎవరూలేని సమయంలో దొంగిలిస్తున్నారు. కాపలాలేని కొత్త ఇళ్ల నుంచి అర్ధరాత్రులు, పగటిపూట కాపర్‌వైర్లు చోరీ చేస్తున్నారు.

కాలనీవాసుల ఇబ్బందులు..



కాపర్‌వైరు కాల్చివేయడంతో వెలువడుతున్న పొగ

కాల్చిన వైర్ల నుంచి వెలువడే పొగతో విషవాయువులు వెలువడుతున్నాయి. అవి గాలిలో కలుస్తూ ప్రజారోగ్యం దెబ్బతింటోంది. ప్రస్తుతం పొగ పీలేడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సైతం ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. పిల్లలకు ఇది మరింత ఇబ్బందిగా మారిందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కరెంట్ వైర్ల దొంగలపై చర్యలు తీసుకుని, ఆ వైర్లు కాల్చకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు పూర్తిచేయాలి

జగిత్యాల: ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ లక్ష్యాలను పూర్తిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో ఆమె కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటి వెలుగు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలన్నారు. కళ్లద్దాలు త్వరగా అందించేలా చూడాలని అన్నారు. భూముల క్రమబద్ధీకరణ అంశానికి సంబంధించి ప్రభుత్వం జారీచేసిన ఉత్వర్వులు 58, 59, 76, 118 పురోగతిపై సమీక్ష చేయాలని సూచించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు కేటాయింపులో పురోగతి సాధించాలన్నారు. పోడు భూములు, పట్టాభూములు వెంటనే అందించాలని అన్నారు. రానున్న వేసవి దృష్ట్యా అగ్నిప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీగ్రామంలో వైకుంఠధామం నిర్మాణం పూర్తిచేసిన వినియోగంలోకి తేవాలని చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, కంటి వెలుగు విజయవంతంగా నడుస్తోందన్నారు. పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మకరంద్, లత తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు



గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

- సిరిపురం గ్రామస్తుల సమస్యలపై ఆరా

సారంగాపూర్(జగిత్యాల): కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాలతో జిల్లా అధికారులు శుక్రవారం బీర్‌పూర్ మండలం సిరిపురం గ్రామానికి తరలివెళ్లారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివరాలు.. నూతన గ్రామపంచాయతీల ఏర్పాటులో భాగంగా సిరిపురం గ్రామాన్ని బీర్‌పూర్ గ్రామంలో చేర్చారు. అంతకుముందు ఆ ఊరు ధర్మపురి మండలంలో శివారు గ్రామంగా కొనసాగింది. దీంతో గ్రామస్తులకు పలు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. నాలుగు ఏళ్లుగా ఉపాధిహామీ పనులు చేయడానికి వీలులేకుండా పోయింది. గ్రామంలో 25 లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. వీటికి బిల్లులు విడుదల కావడం లేదు. గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదు, అంగన్‌వాడీ టీచర్ రావడం లేదు. ఇలాంటి సమస్యలపై బీజేపీ నాయకులు, గ్రామస్తులు ఇటీవల ప్రజావాణి ద్వారా కలెక్టర్ యాస్మిన్ బాషాకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్.. సిరిపురం గ్రామానికి వెళ్లి సమస్య పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈమేరకు డీఆర్డీవో లక్ష్మీనారాయణ నేరుగా గ్రామస్తులతో మాట్లాడారు. గతంలో గాదేపల్లి గ్రామంలోని జాబ్‌కార్డులను సిరిపురం గ్రామానికి మార్చి, కొత్తగా జాబ్ కార్డులను వెంటనే అందించడానికి సీఆర్‌డీ కమిషనర్ కార్యాలయానికి వివరాలను ఆన్‌లైన్ ద్వారా పంపించారు. వారంరోజుల్లో ఉపాధిహామీ పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. డీపీవో నరేశ్ ఇతర సమస్యలు పరిష్కరిస్తానని గ్రామస్తులకు తెలియజేశారు. వారివెంట ఎంపీడీవో మల్లారెడ్డి తదితరులు ఉన్నారు. బీజేపీ నాయకులు మ్యాడ జనార్దన్, ఆడెపు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఏఎన్‌ఎం అవార్డు అందుకున్న పుష్పలత

రాయికల్(జగిత్యాల): జాతీయ కుష్టు నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో అందజేసిన ఉత్తమ ఏఎన్‌ఎం అవార్డును బోర్నపల్లి ఏఎన్‌ఎం పుష్పలత డీఎంహెచ్‌వో శ్రీధర్ చేతుల మీదుగా శుక్రవారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డెప్యూటీ డీఎంహెచ్‌వో జైపాల్‌రెడ్డి, ఎస్‌పీహెచ్‌వో శ్రీనివాస్, ఏఎంఏ అధ్యక్షుడు సురేశ్, టీబీ ఆఫీసర్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఉత్తమ ఏఎన్‌ఎంగా జమున

మల్యాల(చొప్పదండి): మండల కేంద్రానికి చెందిన మల్యాల జమున ఉత్తమ ఏఎన్‌ఎంగా ఎంపికయ్యారు. ఈమేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, డాక్టర్ సురేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రపంచ టీబీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు జమునకు శుభాకాంక్షలు తెలిపారు.

హన్మాజీపేటలో పిచ్చికుక్కల స్వైర విహారం



గాయపడ్డ పోశెట్టి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వాటి దాడితో ఇప్పటికే 12 పశువులు మృతిచెందాయి. శుక్రవారం మరో పశువును కుక్క కరవడంతో రేబిస్ సోకింది. దీంతో గ్రామస్తుడు బొడ్డు పోశెట్టిపై పశువు దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, పిచ్చికుక్కల దాడులు పెరగడంతో గ్రామస్తులు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు.

మాదిగ హక్కుల ఐక్యవేదిక కార్యవర్గం

వెల్గటూర్(ధర్మపురి): తెలంగాణ మాదిగ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా ఎండపల్లి మండలం గుల్లకోటకు చెందిన చుంచు మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎండపల్లి జేపీఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని దళిత సామాజిక వర్గ నాయకులు, ధర్మపురి నియోజకవర్గ దళిత నాయకులు హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడితోపాటు రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడుతోపాటు కార్యవర్గ సభ్యులు శుక్రవారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు చుంచు మల్లేశంను మంత్రి కొప్పుల ఈశ్వర్ శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా సలహాదారు రామగిరి మల్లేష్, కోఆర్డినేటర్లు కుషనపెల్లి రాజేశ్, దూడ జీవన్, దావుల రాకేశ్, అవునూరి శ్రీకాంత్, బుచ్చిలింగం, సనిల్, శంకర్, రాజు, నారాయణ, ఆనంద్, ప్రభాకర్, శ్రీను, రాజ్‌కుమార్, కిరణ్, బానేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐతో విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న సాంబారి ప్రభాకర్

మల్లాపూర్(కోరుట్ల): టీఎస్ పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్ ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత జీవితాలతో ముడిపడిన ప్రశ్నపత్రాల లీకేజీపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. వారికి మద్దతుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శనివారం హైదరాబాద్‌లో చేపట్టే 'నిరుద్యోగుల గోస' దీక్షకు నాయకులు, కార్యకర్తలు, యువత పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు గడ్డం నవీన్‌రెడ్డి, నాయకులు ఎర్ర లక్ష్మీ, గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, మండ స్వామి, గుండా నరేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించొద్దు

- సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

చిగురుమామిడి: ప్రజాసమస్యలు పరిష్కరించకుండా ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం చిగురుమామిడిలోని ముస్కురాజిరెడ్డి స్మారకభవనంలో సీపీఐ మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో పెట్టుబడిదారుల కొమ్ముకాసే ప్రభుత్వంతో ప్రమాదం పొంచి ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ పాలనపై ప్రజావ్యతిరేకతను ప్రజలకు వివరించేందుకు దేశవ్యాప్తంగా బీజేపీ కో హఠావో దేశ్‌కో బచావో అనే నినాదంతో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. మండల సీపీఐ కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సీతారాంపూర్ సర్పంచ్ గోలీ బాపురెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందెస్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బోయిని పటేల్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాజయ్య, బూడిద సదాశివ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

మృతదేహం పురుషుడిదే...

- వైద్య పరీక్షల్లో గుర్తింపు

జగిత్యాలక్రైం: జిల్లాలోని మల్యాల మండలం ముత్యంపేట గ్రామ శివారులో జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారి సమీపంలో ఈనెల 14న మృతదేహం ముక్కలుగా లభ్యమైన విషయం విదితమే. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహం శరీర భాగాలను వైద్య పరీక్షలకు పంపించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వైద్యులు నివేదిక విడుదల చేశారు. మృతదేహం సుమారు 18 - 40 మధ్య వయస్సు గల పురుషుడిగా వైద్యులు నిర్ధారించారు. ఎవరైనా హత్య చేసి ఇక్కడకు శవాన్ని తీసుకువచ్చారా, లేదా ఇక్కడే హత్య చేసి మృతదేహాన్ని కాల్చివేశారా? అనే కోణంలో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విచారణ చేపడుతున్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కథలాపూర్(వేములవాడ): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి నారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. గదులను పరిశీలించి పరీక్షల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సౌకర్యాల కల్పనపై ఆయన ఆరా తీశారు. ఆయన వెంట పరీక్షల విభాగం అధికారి గంగాధర్, ప్రిన్సిపాల్ గౌసుర్ రహమాన్ ఉన్నారు.

ఆశలు ఆవిరి

- గ్రూప్–1 పరీక్ష రద్దుతో నిరుద్యోగుల్లో ఆందోళన
- ఆర్థిక భారంతో యువత ఆవేదన
- మళ్లీ పరీక్ష రాసేందుకు వెనుకడుగు

జగిత్యాలక్రైం: టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన యువతలో నిరుత్సాహం నెలకొంది. ఉద్యోగం సాధిస్తామనే ధీమాతో ఉన్న నిరుద్యోగుల్లో నిరాశ అలముకుంది. గ్రూప్–1 పరీక్ష రద్దు కావడంతో జిల్లాలో ఉత్తీర్ణులైన వారిలో సర్వత్రా ఆందోళన నెలకొంది.

21 కేంద్రాల్లో 6,885 మంది..

గత అక్టోబర్ 16న గ్రూప్–1 పరీక్ష నిర్వహించారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 6,885 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఈ ఏడాది జనవరి 13న ఫలితాలు విడుదలయ్యాయి. ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారు తదుపరి పరీక్షకు సిద్ధమవుతున్న తరుణంలో పేపర్ లీకైంది. దీంతో పరీక్షలు రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ప్రకటన చేశారు. దీంతో నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ఇప్పటికే క్వాలిఫై అయినవారు తదుపరి పరీక్ష కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. కొందరు రూ.లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్నారు. మరికొందరు కాంపిటీషన్ బుక్స్ తెప్పించుకుని చదువుకుంటున్నారు. ఈ తరుణంలోనే టీఎస్‌పీఎస్సీ పరీక్ష రద్దు చేస్తున్నట్లు ప్రకటన వెలువడడం ఆందోళన కలిగిస్తోంది.

రెండేళ్లు కష్టపడ్డా

డిగ్రీ చదువుతున్నప్పటి నుంచి గ్రూప్–1 ఉద్యోగం సాధించాలనేది నా లక్ష్యం. ఇందుకోసం రెండేళ్ల నుంచి పరీక్షల కోసం సిద్ధమవుతున్నా. అక్టోబర్‌లో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షల్లో అర్హత సాధించా. ఇప్పుడు పరీక్ష రద్దు చేయడంతో ఆందోళన మొదలైంది.

– పి.పద్మ, జగిత్యాల

రోజూ ఎనిమిది గంటలు చదివా



టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 పరీక్షకు రోజూ సుమారు ఎనిమిది గంటల పాటు కష్టపడి చదివా. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వర్తిస్తున్నా. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదివా. కానీ ప్రభుత్వం పరీక్ష రద్దు చేయడంతో మళ్లీ ఉద్యోగం సాధించడం ఎలా అనే ఆందోళన నెలకొంది.– గుర్రం మల్లారెడ్డి, తక్కళ్లపల్లి

ఉన్నత ఉద్యోగం లక్ష్యం



చాలా ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో రోజుకు 10 గంటల పాటు కష్టపడి చదివా. గతంలో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షల్లో క్వాలిఫై అయ్యా. తదుపరి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి గ్రూప్–1 ఉన్నత ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ఉంది. కానీ, పేపర్ రద్దు అయోమయం కలిగిస్తోంది.

– నలువాల ముత్యం, సారంగాపూర్

బార్ అసోసియేషన్ ఎన్నికలకు 20 నామినేషన్లు

జగిత్యాలజోన్: జగిత్యాల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఈనెల 31న జరుగనున్నాయి. శుక్రవారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. రెండు రోజుల్లో 20 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అధ్యక్ష పదవికి ఎర్ర నర్సయ్య, కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పదవికి చీటి రామకృష్ణారావు, భూమి రమణకుమార్, సంయుక్త కార్యదర్శి పదవికి అందె మారుతి, జున్ను రాజేందర్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే, ఉపాధ్యక్ష పదవికి సిరిపురం మహేంద్రనాథ్, మహిళా కార్యదర్శి పదవికి పుప్పాల వనిత తమ నామినేషన్లు దాఖలు చేశారు. గ్రంథాలయ కార్యదర్శి పదవికి కర్నె హరిదాసు, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శి పదవికి పొట్టవత్తిని సతీశ్, కార్యవర్గ సభ్యుల పదవులకు గుడికందుల మహేశ్, అల్లె పురుషోత్తం, శ్రీరాం కరుణాకర్, నీరటి వెంకటేశ్, కొత్తపల్లి గంగారాజం, రాచకొండ విజయ్‌కృష్ణ, రాజేశుని జీవన్, కంచి సురేశ్, బొల్లె రమేశ్, ఎండీ సలీం నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, అధ్యక్ష, ప్రధానకార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులకు మాత్రమే రెండేసి నామినేషన్లు దాఖలు చేశారు. మిగతా పదవులకు ఒకేనామినేషన్ దాఖలు కావడంతో వారి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఇదిలా ఉంటే, శనివారం నామినేషన్ల పరిశీలన ఉంటుందని ఎన్నికల అధికారి టి.గంగాధరాప్రసాద్, సహాయ ఎన్నికల అధికారి ఎస్.సంజీవ్‌రెడ్డి తెలిపారు.

రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సమావేశంలో సంఘంలోని లావాదేవీల విషయంపై చర్చించారు. అదేవిధంగా రుణ వసూళ్ల గురించి, ఆర్థిక లావాదేవీల గురించి చర్చించారు. అనంతరం చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల అవసరాల కోసం తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రుణ వాయిదాలను సకాలంలో చెల్లించాలని అన్నారు. అనంతరం రైతులు వ్యవసాయ పనుల కోసం తీసుకుంటున్న రూ.14.20లక్షల విలువైన చెక్కులను చైర్మన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ బత్తిని అరుణ, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సంఘం ఉపాధ్యక్షుడు షేర్ల రాజేశం, బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, డైరెక్టర్లు ఎల్లాగౌడ్, సీఈవో రాజేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ప్రధానమంత్రి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ధర్మపురి: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై లోక్‌సభలో అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం పట్టణంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. స్థానిక నంది కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీపై వేసిన అనర్హత వేటును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ తమ ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. ఇదే తరహాలో రాహుల్‌గాంధీ దేశప్రజల కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కష్టపడుతున్నారని అన్నారు. ఆయనపై అనర్హత వేటు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజేశ్, సింహరాజు ప్రసాద్, కుంట సుధాకర్, రాందేని మొగిలి, సీపతి సత్యనారాయణ, సుముఖ్, ఎండీ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.